సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 7 । జనవరి । 2024



అమ్మవారికి విశేష పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, పసుపు కుంకుమ నీళ్లతో అభిషేకం జరిపారు.



మార్మోగిన గోవింద నామం

విశాఖ రుషికొండపై శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గోవిందా... గోవిందా అంటూ స్మరించారు.



అప్పన్న దీక్షల విరమణ 8లో

అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది.

న్యూస్‌రీల్

పాల్గుణకు ఘన స్వాగతం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పాల్గుణకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

అరకులోయ టౌన్‌: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు శనివారం అరకులోయలో ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తరువాత విజయవాడ నుంచి ఇక్కడికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి పార్టీ మరింత పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్‌ కుమార్‌, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్‌, సర్పంచ్‌ రాధిక, పార్టీ జిల్లా సయుక్త కార్యదర్శి గొల్లోరి గోపాలరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బీ కిరణ్‌కుమార్‌, పార్టీ మండల కన్వీనర్‌ పట్టాసి సంపత్‌కుమార్‌, పార్టీ నేతలు బలరాం, నర్సింగ్‌ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వెలుగులు

- అరకు ఎంపీ మాధవి



హుకుంపేటలో వీధి దీపాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవి

హుకుంపేట: సీఎం జగనన్న పాలనలో ప్రతీ గ్రామంలో వీధి దీపాలతో వెలుగు కనిపిస్తోందని అరకు అసెంబ్లీ సమన్వయకర్త, ఎంపీ మాధవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించిన ఆమెకు పార్టీ శ్రేణులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెకు స్వీట్లు తినిపించారు. అనంతరం ఆమె ఎంపీ నిధులతో పంచాయతీలకు కొనుగోలు చేసిన సామగ్రిని స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సర్పంచ్‌లకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నిధులతో పాటు వీధి దీపాలు కరువయ్యాయన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు,సర్పంచ్‌ వెంకటపూర్ణిమ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్నాయక్‌ మాస్టారుకు అరుదైన గౌరవం

- తెలుగు మహాసభల్లో పాల్గొనే అవకాశం



తెలుగు మహాసభల వేదికపై పతకం, సర్టిఫికెట్‌ అందుకుంటున్న పట్నాయక్‌

గంగవరం : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, రచయిత, కళాకారుడు ఎస్‌ఎం పట్నాయక్‌ మాస్టారుకు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనే అవకాశం దక్కింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గైట్‌ కళాశాల ఆవరణలో నిర్వహించిన తెలుగు మహాసభలకు ఆదర్శ విద్యా సంస్థల నుంచి ఆయన హాజరయ్యారు. మాతృదేవోభవ అనే వచన కవితకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై పతకం, సర్టిఫికెట్‌ను ఆయన అందుకున్నారు.

ముఠా ఆచారం.. విశిష్టం

జిల్లాలో కొండబ పంచాయతీలోని సింగర్భ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలు ముఠా (సంఘం)గా ఏర్పడి ఏడాది పొడవునా పండగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వారు తీసుకునే సమష్టి నిర్ణయాలు ఐక్యతకు, గిరిజన సంప్రదాయానికి అద్దం పడుతున్నాయి. నెలకొక పండగను నిర్వహించే వీరు ప్రస్తుత నెలలో భోగి, సంక్రాంతి, కనుమను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



సింగర్భ గ్రామంలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న గిరిజనులు (ఫైల్‌)

- గిరిజన సంప్రదాయానికి అద్దం పడుతున్న కొండబ
- సింగర్భ కేంద్రంగా ప్రత్యేక వ్యవస్థ
- ఏడాది పొడవునా నెలకొక పండగ నిర్వహణ
- ఐక్యతను తెలిపేలా సమష్టి నిర్ణయాలు
- సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు

అనంతగిరి: గిరిజన ఆచార సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. మండలంలోని కొండిబ పంచాయతీ సింగర్భ పరిసర గ్రామాల ప్రజలు ఏడాది పొడవునా నిర్వహించే పండగలు ఇందుకు అద్దంపడుతున్నాయి. కొండబ పంచాయతీలోని నడిమివలస, తోకవలస, సీసాముండ, బొరిబొరివలస, జామిగుడ, కోనమామిడి గ్రామాల ప్రజలు సింగర్భ కేంద్రంగా ముఠా (సంఘం)గా ఏర్పడ్డారు. ఇందులో అన్ని తెగలకు చెందిన సుమారు 400 కుటుంబాలు భాగస్వాములయ్యాయి. వీరంతా కలిసి ముఠా పెద్దను నియమించుకున్నారు.

ముఠా సభ్యులే కీలకం..

పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలతోపాటు తగదాలు పరిష్కరించడంలో ఈయనతోపాటు ముఠా కమిటీ సభ్యులు కీలకంగా వ్యవహరిస్తుంటారు. వారు తీసుకున్న నిర్ణయాలను ప్రజలంతా గౌరవించాల్సిందే. జనవరి నుంచి ఏడాది పొడవునా నిర్వహించే పండగలకు ముందుగానే కార్యాచరణ రూపొందిస్తారు. మార్చిలో విత్తనాల జాతర నుంచి ప్రారంభమై సంక్రాంతి పండగతో ముగుస్తుంది. ప్రతినెలా నిర్వహించే పండగలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఈ పండగలకు సభ్యులంతా చందాలు వేసుకుని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆసక్తికరంగా 'సంక్రాంతి'

ఏడాది పొడవునా నిర్వహించే పండగల్లో సంక్రాంతికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పండగ నిర్వహించే విధానం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సింగర్భ ముఠా పరిధిలోని ఏడు గ్రామాల గిరిజనులంతా ఒకేచోట చేరి సమష్టి నిర్ణయాలు తీసుకుంటారు. అడవికి వెళ్లి వెదురు కర్రలను తీసుకువస్తారు. వాటితో ఏనుగు, గుర్రం, ఎద్దు నమూనాలను తయారుచేసి వాటిపై ముఠా పెద్దలను ఎక్కించి భోగి, సంక్రాంతి, కనుమ రోజున ఊరేగిస్తారు. పంటలు బాగా పండాలని పూజలు నిర్వహించి, పూజారిని ఎద్దులపై ఊరేగిస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారంగా వారు తెలిపారు.

కష్టాలు దరిచేరనివ్వని నందీశ్వరుడు

సంక్రాంతి ముగిసిన తరువాత ఫిబ్రవరిలో నందీశ్వరుడి పండగను నిర్వహిస్తారు. తెల్లవారుజామున మూడు గంటలకు పుట్ట వద్దకు వెళ్లి మట్టి తీసుకు వచ్చి ఉపవాసంతో నందీశ్వరుడిని తయారు చేస్తారు. అనంతరం ఇంటింటికీ తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. కష్టాలు రాకుండా నందీశ్వరుడు కాపాడుతాడని ముఠా గ్రామాల ప్రజల నమ్మకం. వీరు ఏడాది పొడవునా గంగమ్మతల్లి, పెద్ద దేవత, కొండదేవత, నందీశ్వరుడు, కళాదేవత, జాగరమ్మ దేవతలను పూజిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా రావి చెట్టు

సింగర్భం గ్రామంలో భారీ రావిచెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిని 50 ఏళ్ల క్రితం అప్పటి ముఠా నాయకుడి కుటుంబానికి చెందిన గుజ్జెల రామచైతన్యం నాటినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. పంచాయతీ పరిధిలో ఏడు గ్రామాల ప్రజలు పూజలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం 20 మంది సభ్యులున్న ముఠా (సంఘం)కు నాయుడిగా గుజ్జెల కృష్ణమూర్తి, పెద్దగా సిరగం పరుశరామ్‌ వ్యవహరిస్తున్నారు.

ముఠా నిర్ణయాలను శిరసావహిస్తాం

పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల్లో గిరిజనులు ముఠా నిర్ణయాలకు కట్టుబడి ఉంటాం. తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. ముఠా నాయుడిని, ముఠా పెద్దలను ఎంతో గౌరవిస్తారు. శుభకార్యాల నిర్వహణకు ముఠా పెద్దలను సంప్రదిస్తారు.

– సిరగం పరశురామ్‌, ముఠా పెద్ద, సింగర్భ

ఆచార సంప్రదాయాలను గౌరవిస్తాం

పూర్వీకులు నేర్పిన గిరిజన ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాం. మమ్మల్ని మేము గౌరవించుకుంటూ ఒకరికొకరు సాయం చేసుకుంటాం. కష్టకాలంలో అందరం ఒక్కటూ అండగా నిలుస్తాం.

– గుజ్జెలి కృష్ణమూర్తినాయుడు, ముఠా నాయుడు, సింగర్భ



గిరిజనులు పూజిస్తున్న గ్రామదేవతలు



వెదురుతో తయారుచేసిన ఏనుగుపై ఊరేగింపు



ముఠా నాయకుడి ఊరేగింపు (ఫైల్‌)

రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నే సీఎం

- అభివృద్ధి సంక్షేమమే గెలిపిస్తుంది
- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



విలేకరులతో మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవి

అరకులోయ టౌన్‌: అభివృద్ధి, సంక్షేమమే మళ్లీ జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రిని చేస్తుందని ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత ప్రథమంగా వచ్చిన సందర్భంగా ఆమెకు అరకు సంతబయలు వద్ద హారతులిచ్చి, పూలమాలలు వేసి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. హుకుంపేట నుంచి అరకు రైల్వేస్టేషన్‌ వరకు బైక్‌ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం అరకు రైల్వే స్టేషన్‌ వద్ద విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. గత ఎన్నికల్లో అరకు ఎంపీగా ఆశీర్వదించి 2.40 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనను అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారన్నారు. గత ఎన్నికల్లో మాదిరిగానే రాబోయే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని కోరారు. తన తండ్రి గొడ్డేటి దేముడు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, నేను వేరే ఖండం, వేరే దేశం నుంచి రాలేదన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం నా కుటుంబం పాటుపడుతుందన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక శాసన సభ్యుడు చెట్టి పాల్గుణతో కలిసి పనిచేస్తున్నానని, ఇటీవల హుకుంపేటలో జరిగిన బస్సుయాత్ర విజయవంతమైందన్నారు. 2024 ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌ పరిధిలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీటీసీ దురియా ఆనంద్‌, పద్మాపురం, హుకుంపేట సర్పంచ్‌లు సుస్మిత, పార్టీ నేతలు కమిడి అశోక్‌, శెట్టి వెంకటరావు, సుక్రయ్య, కొండబాబు పాల్గొన్నారు.



అరకు రైల్వేస్టేషన్‌ వద్ద పార్టీ శ్రేణులతో ఎంపీ మాధవి

అనుమానమే పెనుభూతమై..

- భార్యను అతికిరాతంగా హతమార్చిన భర్త
- వీరపాపనకుంటలో ఘటన



రాధ మృతదేహం

వీఆర్‌పురం : భార్యను అతికిరాతకంగా నరికి హతమార్చిన ఘటన సంచలనమైంది. మండలంలోని ములకనపల్లి పంచాయతీ వీరపాపనకుంటలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సీఐ రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సోయం రాధ(35) స్థానిక మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తోంది. ఆమెకు 18 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సోయం చిరంజీవితో వివాహం అయ్యింది. వీరికి నలుగురు కుమార్తెలు. మద్యానికి బానిసైన చిరంజీవి వేరొకరితో వివాహేతర సంబంధం ఉందని భార్యను తరచూ వేధించేవాడు. దీనిపై గతేడాది గ్రామ పెద్దలు పంచాయతీ నిర్వహించి చిరంజీవిని మందలించారు. ఈనేపథ్యంలో రేఖపల్లిలో కొన్నిరోజులుగా కొనసాగుతున్న అంగన్‌వాడీల ధర్నాకు రాధ కూడా ప్రతిరోజూ వెళ్లి వస్తోంది. ఈ క్రమంలో ఆమెపై చిరంజీవి మరింత అనుమానం పెంచుకున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన అతను భార్యతో ఘర్షణ పడ్డాడు. ఆమె నిద్రిస్తున్న సమయంలో శనివారం ఉదయం అతను పదునైన ఆయుధంతో ఆమె మెడ,ఛాతీపై విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రాధ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ సిబ్బందితో కలిసి సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. నిందితుడు చిరంజీవి పరారీలో ఉన్నట్టు సీఐ రామారావు తెలిపారు.

పండగలా పింఛన్ల పంపిణీ



పనసలపాలెంలో ఉచిత గ్యాస్‌ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పింఛన్ల పండగలో దివ్యాంగునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- అందజేసిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- ముఖ్యమంత్రికి జేజేలు పలికిన లబ్ధిదారులు

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన కొత్త, పెరిగిన పింఛన్ల పంపిణీ పండగ వాతావరణాన్ని తలపించింది. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఈకార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడారు. సుపరిపాలన అందించడంలో సీఎం జగన్‌కు సాటి లేరన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. పింఛను అందజేస్తుండగా పింఛనుదారులు ముఖ్యమంత్రికి జేజేలు పలికారు. కొత్తగా మంజూరైన 25తోపాటు పెరిగిన మొత్తంతో 3,441 పింఛన్లకు సంబంధించి రూ.99.50 లక్షల మొత్తాన్ని ఎమ్మెల్యే అందజేశారు, మండలంలో 613 మంది లబ్ధిదారులకు డి.పట్టాలు, 88 మందికి ఉచిత గ్యాస్‌ కనెక్షన్లను అందజేశారు. మండలంలోని 250 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వై.రామవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెలుగూరి బాలయ్య(24)కు రూ.లక్ష, గత ఏడాది కొండవాగులో కొట్టుకుపోయి మృతిచెందిన పొత్తూరి తమ్మారావు భార్య విశ్వమ్మ కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున సహాయక చెక్కులు ఆమె పంపిణీ చేశారు.

వైస్‌ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌ రోలిపల్లి నరసింహారావు, పార్టీ మండల కన్వీనర్‌ మామిడి అప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్‌ కరణం కనకరాజు, జిల్లా నాయకులు గుడ్ల త్రిమూర్తులు, మండల నాయకులు ఎం.నారాయణరావు, దాగెరి గంగరాజు, పల్లాల అబ్బాయిరెడ్డి, పల్లాల తమ్మిరెడ్డి, బలిరెడ్డి నూకరాజు, మద్దికొండ భారతిబాబు, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, తహసీల్దార్‌ సీహెచ్‌ శ్రీనివాసరావు, డీటీ కె సుధాకర రావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

- గ్రామస్తుల సమక్షంలోనే రహస్యంగా మృతదేహం పూడ్చివేత
- విషయం వెలుగులోకి రావడంతో పోలీసుల రంగప్రవేశం
- బాధితుల ఫిర్యాదుతో అదుపులోకి నిందితుడు
- పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత, పోస్టుమార్టం పూర్తి
- లైంగికదాడి?.. హత్య? కోణంలో దర్యాప్తు
- శవ పరీక్ష నివేదిక ఆధారంగా చర్యలు: ఏఎస్పీ ప్రతాప్‌ శివకిషోర్‌



సంఘటన ప్రదేశం వద్ద పోలీసులు



శవ పంచనామా కోసం ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దారు ప్రసాద్‌

గూడెంకొత్తవీధి: మండలంలోని మారుమూల చెరుకుంపాకల గ్రామంలో 5వ తరగతి చదువుతున్న బాలిక అనుమానాస్పదంగా మృతి చెందింది. గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈమెపై లైంగిక దాడికి పాల్పడడంతోపాటు హత్య చేసినట్టు ప్రాథమిక సమాచారం. ఈఘటన ఈనెల 2న జరగ్గా విషయాన్ని గ్రామస్తులంతా బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. మృతదేహాన్ని ఈనెల 3న పూడ్చిపెట్టారు. విషయం ఆనోటా ఈనోటా పోలీసులకు చేరింది. దీంతో రంగంలోకి దిగిన వారు పూడ్చిపెట్టిన మృతదేహాన్ని శనివారం బయటకు తీయించి పోస్టుమార్టం చేయించారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో..

మండల కేంద్రానికి దూరంగా ఉన్న చెరుకుంపాకల ఆదివాసీ గ్రామంలో గిరిజన బాలిక ఐదో తరగతి చదువుతోంది. ఈమె తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులంతా ఈనెల 2వ తేదీ ఉదయం పొలం పనులకు వెళ్లారు. బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెను పక్కింటిలోకి తీసుకువెళ్లి లైంగికదాడి చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. పొలంపనులకు వెళ్లిన వారు ఇంటికి వచ్చి చూసే సరికి కుమార్తె విగతజీవిగా కనిపించింది. తమ ఇంటిలో ఉరివేసుకుని చనిపోయి ఉండటాన్ని బాలిక తల్లిదండ్రులు గమనించారు. విషయాన్ని బయటకు రానీయకుండా గ్రామస్తులంతా జాగ్రత్త పడ్డారు. ఈనెల 3వ తేదీ ఉదయం మృతదేహానికి అంత్యక్రియలు చేసి గ్రామానికి దూరంగా పూడ్చిపెట్టారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పాటు పోలీసుల దృష్టికి వెళ్లింది. దీనికితోడు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతదేహానికి పోస్టుమార్టం

ఘటన జరిగిన ప్రాంతానికి శనివారం చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌ శివకిషోర్‌, సీఐ అశోక్‌కుమార్‌, ఎస్‌ఐ అప్పలసూరి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు, వైద్యబృందాలను వెంటబెట్టుకుని వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనకు కారకునిగా భావిస్తున్న యువకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా వివరాలు తెలుస్తాయని ఏఎస్పీ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. తహసీల్దారు ప్రసాద్‌, వైద్యాధికారి సుధాశారద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8, 9 తేదీల్లో ఎస్‌ఐ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం: ఎస్‌ఐ రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 8, 9 తేదీల్లో హాజరుకావాలని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. పెదవాల్తేరులో గల డీఐజీ కార్యాలయానికి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరుకావాలని పేర్కొన్నారు. సివిల్ ఎస్‌ఐ (పురుషులు/మహిళలు), ఏపీఎస్పీ(ఆర్‌ఎస్‌ఐ) పోస్టులకు ఎంపికైన వారు మాత్రమే రావాలని సూచించారు.

వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం

- వారం రోజుల్లో మెరిట్ జాబితా
- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి


పాడేరు మెడికల్ కళాశాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న వైద్యాధికారుల బృందం

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాల, అనుబంధ జనరల్ ఆస్పత్రిల్లో 256 పోస్టులు భర్తీ ప్రక్రియ వేగవంతం చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 34 కేటగిరిల్లో 256 పోస్టులకు 11,618 దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. వీటిని వైద్యాధికారులతో కూడిన సాంకేతిక బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. రోస్టర్ ప్రకారం వారం రోజుల్లో మెరిట్ జాబితాను విడుదల చేస్తామని ఆమె పేర్కొన్నారు.

అప్పన్న దీక్షల విరమణ


ఆలయానికి తరలివచ్చిన దీక్షాధారులు

సింహాచలం: అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. నలభై ఒక్కరోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష చేసిన దీక్షాధారులంతా శిరస్సుపై తిరుముడిని పెట్టుకుని మెట్లమార్గంలో, ఘాట్‌రోడ్డులో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి వాటిని సమర్పించి, దీక్ష విరమణ చేశారు. తొలుత సింహగిరికి తరలివచ్చిన దీక్షాధారులంతా తిరుముళ్లతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం మాడ వీధిలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద దీక్షాధారులందరి చేత పండితులు శాస్త్రోక్తంగా దీక్షా విరమణ చేయించారు. అనంతరం స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించిన నృసింహ హోమాన్ని తిలకించారు. శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. దీక్షాధారులంతా స్వామివారి పల్లకితో కొండదిగువ నుంచి పైకి ఘాట్‌రోడ్డులో తరలివచ్చారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛను పెంపు


కొయ్యూరులో పింఛను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు


పద్మాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

కొయ్యూరు: ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛను మొత్తాన్ని రూ.3 వేలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని అరకు పార్లమెంట్ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్క రాష్ట్రం ఒడిశాలో పింఛనుగా రూ.500 మాత్రమే ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రభుత్వం పింఛన్లను రెట్టింపు పెంచిందన్నారు. కొయ్యూరు మండలంలో 7,757 మంది ఫింఛన్లు పొందుతున్నారని, దుకుగాను ఏడాదికి రూ.28.39 కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. చంద్రబాబు ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ప్రతిపక్షాల ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, పేదవాడికి పెత్తందారులకు మధ్య జరుగుతున్న పోరుగా దీనిని చూడాలన్నారు. జెడ్పీటీసీ వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి నూకరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు, సచివాలయాల కన్వీనర్ బండి సుధాకర్, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, ఎంపీటీసీ రత్నం, సర్పంచ్‌లు సోమన్నదొర, చంద్రరావు, ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దార్ తిరుమలరావు మాట్లాడారు.

అర్హులందరికీ పింఛన్లు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మేజర్‌పంచాయతీ పద్మాపురంలో సచివాలయం ఒకటి, రెండు పరిధిలో పింఛను సొమ్ము పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను సొమ్ము పెంపుతో పేదలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఎంపీడీవో వెంకటేష్, సర్పంచ్ సుస్మిత, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, జిల్లా సంయుక్త కార్యదర్శి గోపాల్, యువజన విభాగం అధ్యక్షులు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ గురు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సౌరభం



విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థుల రూపకం


కొచ్చిన్ వర్సిటీ విద్యార్థుల తాయింబగ నాద విన్యాసం


వీణపై రాగాలను పలికిస్తున్న విద్యార్థిని


బొమ్మల తయారీలో తుదిమెరుగులు దిద్దుతున్న విద్యార్థిని

ఏయూక్యాంపస్ : నవరసాలను ఆవిష్కరించారు. భారతీయ కళావైభవాన్ని చాటారు. పుస్తకాలతో సహవాసం చేసే విద్యార్థులు తమలోని కళాప్రతిభను ప్రస్ఫుటం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ యువభేరి దీనికి వేదికగా నిలిచింది. యునిఫెస్ట్‌లో రెండో రోజున ఉదయం మిమిక్రీ, శాస్త్రీయ నృత్యాలు, స్పాట్ పెయింటింగ్, శాస్త్రీయ వాయిద్యాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఏకపాత్రాభినయం, గాత్రం, మట్టిలో బొమ్మల తయారీ, క్విజ్ పోటీలను నిర్వహించారు.

శాస్త్రీయ సౌరభం

ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన వేదికపై నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు విద్యార్థుల ప్రతిభాకౌశలానికి నిదర్శనంగా నిలిచాయి. తమ రాష్ట్రాన్ని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు భారతీయ కళావైభవాన్ని వేదికపై ఆవిష్కరించాయి.

గాత్రం, వాయిద్యం

సాగరిక ఆడిటోరియంలో నిర్వహించిన పోటీల్లో వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమ గాత్రం, వాయిద్య ప్రతిభతో అలరించారు. వీణ, వేణువు, వయోలిన్, మృదంగం, నాదస్వరంపై యువతీయువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

స్పాట్‌పెయింటింగ్, శిల్పాల తయారీ

స్పాట్ పెయింటింగ్‌లో భాగంగా విద్యార్థులు కన్వెన్షన్ సెంటర్ ప్రాంగణంలో కాన్వాస్‌పై ఆవిష్కరించారు. వర్ణాలను అద్దుతూ ప్రకృతిని, భవనాలను, ప్రజలను మాధ్యమంగా చేసుకుని అందమైన చిత్రాలను తీర్చిదిద్దారు. మట్టిబొమ్మల తయారీలో సహజత్వం తొణికిసలాడే విధంగా తమ ఆలోచనలకు, ప్రతిభను జోడించి తీర్చిదిద్దిన శిల్పాలు న్యాయనిర్ణేతల మనసులను దోచుకున్నాయి.

సామాజిక సందేశం

కన్వెన్షన్ సెంటర్‌లో సామాజిక ఇతివృత్తాలను తీసుకొని ప్రదర్శించిన రూపకాలు కట్టిపడేశాయి. అంధవిశ్వాసాలు, దేవదాసీ వ్యవస్థ, మాతంగి వంటి దురాచారాల ఇతివృత్తంగా యూనివర్సిటీ ఆఫ్ కేరళ విద్యార్థుల ప్రదర్శన హృదయాలను తడిమింది. విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థుల రూపకం మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయని చూపుతూ.. చివర్లో దేశభక్తిని పెంచే ముగింపుతో యువతను తట్టిలేపింది. శ్రీ శంకరాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థుల రూపకం ఆకట్టుకుంది.

పర్యాటకుల ఆదాయంతో అభివృద్ధి కార్యక్రమాలు

పాడేరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి హిల్స్‌కు పర్యాటకుల నుంచి వచ్చే ఆదాయంతో పరిసర గ్రామాలు, ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని స్థానిక ఎంపీడీవో సాయి నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా వంజంగి, కాడెలి, లగిసపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ దీపాలు, తాగునీరు, డ్రైనేజీలు, పాఠశాల భవనాల మరమ్మతులకు నిధులు వెచ్చిస్తామన్నారు.రిసార్ట్స్ యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును వెంటనే అందజేయాలని సూచించారు.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు


కళ్లంలోనే ధాన్యం కొనుగోలు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు

రాజవొమ్మంగి: రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు డివిజన్లలోని ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకొన్నాయి. ఈ మూడు సబ్ డివిజన్లలో శనివారం నాటికి 11,766 మెట్రిక్ టన్నుల మేర కొనుగోళ్లు జరిగినట్లు రంపచోడవరం, చింతూరు ఏడీఏ కాశీవిశ్వనాథ చౌదరి, అడ్డతీగల సబ్ డివిజన్ ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలిస్తున్నామన్నారు. త్వరలోనే రైతులకు చెల్లింపులు కూడా జరుగుతాయన్నారు. రాజవొమ్మంగిలోని ఆరు కొనుగోలు కేంద్రాల ద్వారా 3వేల మెట్రిక్ టన్నులు, అడ్డతీగల మండలం నుంచి 1,500 టన్నులు, గంగవరంలో 1,200 టన్నులు కొనుగోలు జరిగినట్టు ఏడీఏ కంకిపాటి సావిత్రి చెప్పారు. రంపచోడవరం మండలంలో 3,700 టన్నులు, మారేడుమిల్లి మండలంలో 31 టన్నులు, రంపచోడవరం మండలంలో 320 టన్నుల కొనుగోలు జరగ్గా చింతూరు డివిజన్‌లో ఇప్పటి వరకు 1600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఏడీఏ కాశీవిశ్వనాథచౌదరి తెలిపారు. మాసూలు పూర్తి చేసుకొన్న రైతులు ధాన్యాన్ని బాగా ఎండ బెట్టి ఆర్బీకేల ద్వారా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. 75 కిలోల సామాన్య రకం ధాన్యం మద్దతు ధర రూ. 1,636 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ గొడ్డేటి మాధవి


తడిగిరి గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీ మాధవి,చిత్రంలో ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: గిరిజన గ్రామలభివృద్ధి జగనన్న పాలనలోనే సాధ్యం అని అరుకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. మండలంలోని తడిగిరి, కొట్నాపల్లి, రంగశీల, దుంబ్రిగుడ మండలం కించుమండల గ్రామాల్లో ఆమె స్థానిక నాయకులతో శనివారం పర్యటించారు. ముందుగా హుకుంపేట మోదకొండమ్మ అమ్మవారి దేవాలయన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించారు. అరుకు ఇన్‌చార్జిగా ఎన్నికై మొదటిసారిగా తమ గ్రామలకు అడుగుపెట్టిన నేపథ్యంలో పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. గిరిజనుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. తడిగిరిలో తాగునీటి సమస్య, కొండచీడిపుట్టులో రోడ్డు సమస్య ఉందని గ్రామస్తులు విన్నవించడంతో ఆమే స్పందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల కోసం జాతీయ రహదారి మంజూరైందన్నారు. భవిష్యత్‌లో సిఎం జగన్‌మోహన్ రెడ్డికు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజుబాబు,గ్రీవేన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు,చింతపల్లి మాజి ఎంపిపి బాబురావు,సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ,కాకరి బొంజుబాబు,ఎంపిటీసీలు కొర్ర నాగరాజు,నాయకులు పెలమల రమేష్,అనిల్,జగదీష్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- టెన్త్ విద్యార్థుల కోసం 50 రోజుల ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు
- సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- హెచ్‌ఎంల సమావేశంలో ఆర్జేడీ, డీఈవో దిశానిర్దేశం


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి

యలమంచిలి రూరల్: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులంతా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య విశాఖపట్నం ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి, డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ సూచించారు. యలమంచిలి సెయింట్ మేరీస్ స్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్జేడీ, డీఈవోలు పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై దిశానిర్దేశం చేశారు. మార్చిలో జరగబోయే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంకాలన్నారు. ఇందుకోసం 50 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందుకోసం ఇప్పటికే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే మెరిట్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు డీసీఈబీ ద్వారా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌పై తర్ఫీదు ఇవ్వాలన్నారు. దాని ప్రకారం విద్యార్థులకు స్లిప్ టెస్టులు, వారాంతపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, వాటి ఆధారంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే తన దృష్టికి తేవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ హెచ్‌ఎంలకు సూచించారు. ఇక 6వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపితే వారు పదోతరగతికి వచ్చేసరికి మెరికల్లా తయారవుతారన్నారు. 6 నుంచి 9 తరగతి వరకూ ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కో విద్యార్థిని దత్తత తీసుకుని అన్ని రకాలుగా వారు వృద్ధిలోకి వచ్చేలా చూడాలని సూచించారు. టోఫెల్ పరీక్షా విధానం ఉద్దేశ్యం నెరవేరేలా ఉపాధ్యాయులతో పనిచేయించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకోసం పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల్లో టాయిలెట్లు, విద్యుత్, ర్యాంప్, తాగునీటి సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఏవైనా మరమ్మతులు అవసరమైతే పాఠశాల నిర్వహణ నిధులనుంచి ఖర్చుపెట్టి వచ్చే శుక్రవారంలోగా చేయించాలన్నారు. రక్తహీనత కలిగిన విద్యార్థులు సెలవుల్లో కూడా ఐరన్ మాత్రలు వేసుకునేలా తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు,హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, కార్యదర్శి జె.రవీంద్రబాబు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రవిబాబు, ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్, యలమంచిలి ఎంఈవోలు వై.మీనాక్షి, పి.అరుణ్‌కుమార్, 24 మండలాలకు చెందిన 48 మంది ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.